


కోటాకు మించి.. విద్యుత్ వినియోగం

● భగభగమండే సూర్యుడి దెబ్బకు పెరిగిన డిమాండ్
● రాబోయే రోజుల్లో మరింత పైపైకి..
● విద్యుత్‌ను ఆదా చేయాలంటున్న అధికారులు

మార్చి నెల రాక ముందే ఎండ అదరగొడుతోంది. దీంతో ఒక్కసారిగా జిల్లాలో విద్యుత్ వినియోగం కూడా పెరిగిపోయింది. ఫిబ్రవరి నెలలో రోజు 12.613 మిలియన్ యూనిట్ల కోటా కేటాయించగా అంతకు మించి వినియోగం ఉంటోంది. ఈ నెల 26న రోజువారి కోటా 12.613 మిలియన్ యూనిట్లు ఉంటే 14.350 మిలియన్ యూనిట్లు వాడారు. కోటా కంటే అదనంగా 1.737 మిలియన్ యూనిట్లను వినియోగించారు. ఇక రాబోయే రోజుల్లో ఎండలు మరింత పెరగనున్నాయి. వేసవి తాపానికి సహజంగానే ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం ఎక్కువగా ఉంటోంది. దీంతో వేసవిలో డిమాండ్‌కు మించి ఖర్చు కానుంది. విద్యుత్‌ను ఆదా చేస్తే ఇబ్బందులు ఉండవని అధికారులు సూచిస్తున్నారు.

(కడప-ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలో మొత్తం అన్ని రకాల విద్యుత్ కనెక్షన్లు 12,69,211 కనెక్షన్లు ఉన్నాయి. వీటిల్లో గృహ విద్యుత్ కనెక్షన్లు 9,46,973 కనెక్షన్లు ఉండగా, వాణిజ్యం 1,07,220, పరిశ్రమలు 6,634, ప్రభుత్వ కార్యాలయాలు, వీధిలైట్లు, ప్రార్థనా మందిరాల కనెక్షన్లు 1,90,543 కనెక్షన్లు ఉన్నాయి. ఇక వ్యవసాయ కనెక్షన్లు 1,90,543, హెచ్‌డీ కనెక్షన్లు 748 ఉన్నాయి. మొత్తం కలుపుకుంటే 12,69,211 కనె క్షన్లు ఉన్నాయి. జిల్లాలో ఇంతవరకు విద్యుత్ కోతలు లేవు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ సరఫరాను గ్రూపుల వారీగా ఇస్తున్నారు. ఇక గృహాలు, పరిశ్రమలకు ఇతర వాటికి ఇప్పటి వరకు అయితే కోతలు లేవు. రెండో శనివారం విద్యుత్ మరమ్మతులు చేస్తున్నందుకు కొన్ని ఏరియాల్లో కోత విధిస్తున్నారు.



పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

ఫిబ్రవరి నెలలో వాతావరణంలో మార్పులు వచ్చాయి. ఎండ క్రమేపీ పెరుగుతూ వస్తోంది. ఇటీవల కాలంలో జిల్లాలో 36, 37 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో పదిరోజుల నుంచి ఎండ పెరుగుతుంది. ఉదయం 10 గంటలకే భానుడు భగభగమంటున్నాడు. సహజంగానే విద్యుత్ డిమాండ్ పెరుగుతూ ఉంది. జిల్లాలో గత వారం రోజులుగా కేటాయించిన కోటా, వినియోగం, డిమాండ్ గురించి పరిశీలిస్తే..

తేది	కోటా మి. యూనిట్లు	వినియోగం	అదనపు వినియోగ యూనిట్లు
16న	12.613	14.223	1.610
17న	12.613	13.786	1.123
18న	12.613	14.415	1.802
19న	12.613	14.508	1.895
20న	12.613	14.721	2.108
21న	12.613	14.832	2.219
22న	12.613	14.391	1.778
23న	12.613	14.712	2.099
24న	12.613	13.658	1.045
25న	12.613	14.542	1.929
26న	12.613	14.350	1.737





విద్యుత్‌ను ఆదా చేయండి

వేసవి కాలంలో సహజంగానే విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల బిల్లులు కూడా ఎక్కువ వస్తాయి. విద్యుత్ ఆదా చేస్తే కరెంటు బిల్లులు తగ్గించుకోవచ్చు. ఇళ్లల్లో సాంప్రదాయ బల్బుల స్థానంలో ఎల్‌ఈడీ బల్బులు వాడితే 60 శాతం విద్యుత్ ఆదా చేయవచ్చు. ఎలక్ట్రానిక్ వస్తువులను రిమోట్ ద్వారా కాకుండా స్విచ్ ఆఫ్ చేయాలి. ఒక ఏసీ 30 ఫ్యాన్ల వినియోగంతో సమానం. ఏసీని 24 నుంచి 26 డిగ్రీల మధ్య ఉంచుకోవాలి. ఇక వాషింగ్‌మిషన్‌కు సరిపడా దుస్తులు ఉంటేనే వినియోగించుకోవాలి. వేడినీళ్ల కోసం గ్రీజర్లు కాకుండా సోలార్ ఏర్పాటు చేసుకోవాలి. అవసరం లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు ఆఫ్ చేసి ఉంచాలి. వీలైనంత వరకు పగటి పూట కిటికీలు తెరిస్తే మంచిది. ఉదయం 5 నుంచి 9 వరకు, సాయంత్రం 6 నుంచి రాత్రి 10 వరకు విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది.

- రమణ, ఎస్ఈ, ట్రాన్స్‌కో

మద్దతు ధరతో కందుల కొనుగోలు

● 1607 మెట్రిక్ టన్నులు సేకరణే లక్ష్యం
● ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పరిమళ జ్యోతి



కడప ఎన్టీఆర్‌సర్కిల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రైతుకు మద్దతు ధర కల్పించడంలో భాగంగా కందుల సేకరణ చేపడుతున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎం.పరిమళజ్యోతి పేర్కొన్నారు. నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఆమె ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూలో తెలిపారు.

ఫటాఫట్

ప్రశ్న: జిల్లాలో కందుల దిగుబడి ఏ స్థాయిలో ఉంది ?
జవాబు: 9400 మెట్రిక్ టన్ను (ఎంటీ)లు దిగుబడి ఉన్నట్లు తెలుస్తోంది. కానీ 1604 ఎంటీల సేకరణ లక్ష్యంగా నిర్ణయించారు.

ప్రశ్న: క్వింటా కందులకు ఎంత రేటు చెల్లిస్తున్నారు?
జవాబు: రూ.7,550 మద్దతు ధరగా నిర్ణయించారు.

ప్రశ్న: ఒకరైతు నుంచి ఎంత మేర సేకరిస్తున్నారు ?
జవాబు: ఒక రైతు నుంచి రోజుకు 40 క్వింటాళ్ల వరకు సేకరిస్తున్నాం. ఆ రైతు వద్ద ఇంకా మిగిలి ఉంటే రెండవ విడతలో కొనుగోలు చేస్తాం.

ప్రశ్న: నాణ్యత ప్రమాణాలు ఎలా పరిగణిస్తున్నారు ?
జవాబు: 12 శాతం లోపు తేమ ఉండాలి. రెండుశాతం లోపు వ్యర్థాలు, మూడు శాతం ఇతరపంట గింజలు మించకుండా ఉండాలి.

ప్రశ్న: కందులు విక్రయించే రైతులు ఎవరిని కలవాలి
జవాబు: రైతులు మొదటగా రైతు సేవా కేంద్రంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలి. గ్రామాల వారీగా ఒక షెడ్యూల్ రూపొందించి కొనుగోలు కేంద్రం నుంచి సేకరిస్తారు. ఇప్పటి వరకు జిల్లాలో 738 మంది రైతులు తమ పేర్లను రైతు సేవా కేంద్రంలో నమోదు చేయించుకోవడం జరిగింది.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు ?
జవాబు: జిల్లాలో ఎనిమిది కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. రైతులకు అనువుగా ఉండే విధంగా జమ్మలమడుగు, ముద్దనూరు, తొండూరు, కమలాపురం, సింహాద్రిపురం, ప్రొద్దుటూరు, పులివెందుల, పోరుమామిళ్లలో ఈ కేంద్రాలు నడుస్తున్నాయి.

ప్రశ్న: ఇప్పటివరకు ఎంత మేర సేకరించారు ?
జవాబు: ఈ నెల 10 నుంచి కందుల సేకరణ జరుగుతోంది. ఒక జమ్మలమడుగు కేంద్రం నుంచే 38 ఎంటీల కందులు సేకరించాం. లక్ష్యాన్ని చేరుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.

బాబుకు విజన్ పిచ్చి.. జగన్‌కు ప్రతిపక్ష పిచ్చి

● కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్ర బాబుకు విజన్-2047 పిచ్చి.. మాజీ సీఎం జగన్‌కు ప్రతిపక్ష హోదా పిచ్చి పట్టిందని కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్రానికి సంజీ విని లాంటి ప్రత్యేక హోదా గురించి ఇద్దరూ పట్టించు కోలేదని విమర్శించారు. చంద్రబాబునాయుడు స్వర్ణాంధ్ర 2047 గురించి పదేపదే ప్రస్తావించడం హాస్యాస్పదమని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తే ప్రజలు హర్షిస్తారని తెలిపారు. రాష్ట్రాన్ని మద్యాంధ్ర, జూదాంధ్ర, అప్పుల ఆంధ్రగా కాకుండా చూడాలని కోరారు. వైసీపీకి కనీసం పదిశాతం మంది ఎమ్మెల్యేలు ఉంటే ప్రతిపక్ష హోదా కల్పిస్తారని, 11 మంది ఎమ్మెల్యేలే ఉన్నందున ప్రతిపక్ష హోదా ఇవ్వరని, దీన్ని సాకుగా చూపి జగన్ అసెంబ్లీకి వెళ్లనని చెప్పడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి సంజీవని లాంటి ప్రత్యేక హోదా వస్తే పన్ను రాయితీలు, పరిశ్రమలు వస్తాయని, ఈ హోదాపై ఇరువురూ కేంద్రాన్ని నిలదీయాలని సీఎం చంద్రబాబుకు, మాజీ సీఎం జగన్‌కు తులసిరెడ్డి సలహా ఇచ్చారు.

ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో భారీగా వసూళ్లు

● లబోదిబోమంటున్న బాధితులు
● పోలీసులకు ఫిర్యాదు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల వద్ద నుంచి భారీగా వసూళ్లు చేసి అడ్రస్ లేకుండా పోయిన సంఘటన జమ్మలమడుగులో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిరుద్యోగులకు ఆశ చూపి ప్రభుత్వ జూనియర్ కళా శాలలో సీసీడీవో పోస్టుల పేరుతో వారి నుంచి భారీ మొత్తం వసూళ్లు చేశాడు. ఒక్కొక్కరి నుంచి రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు డబ్బులు తీసుకు న్నాడు. వసూళ్లు చేసిన వ్యక్తి కడపలో ఏజెంట్‌గా ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు. మొత్తం 20 మంది దాకా బాధితులు ఉన్నారని, దాదాపు రూ.కోటి వరకు దండుకున్నట్లు ఆవేదన చెందుతున్నారు. ఈ వ్యవహారం గత నెల రోజుల నుంచి ఎవరికీ చెప్పుకో లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. బాధితులం తా ఆ ఏజెంట్‌కు డబ్బులు ఇచ్చిన ఆధారాలతో పాటు అర్బన్ పోలీసు స్టేషన్‌లో సీఐ లింగప్పకు గురువారం రాత్రి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై అర్బన్ సీఐ లింగప్పను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా బాధితులంతా రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని, ఇందుకు సంబంధించి ఏజెంట్‌ను శుక్రవారం పిలిపించి విచారిస్తామని సీఐ తెలిపారు.

గంగమ్మ తల్లీ.. పాహిమాం..

● నేటి నుంచి అనంతపురం గంగమ్మ తల్లి జాతర



వివరాలు 7లో..

చింతల గంగమ్మజాతరలో అపశ్రుతి 7

● ఆర్.తుమ్మలపల్లిలో విషాదం
● సిరిబండి కింద పడి వ్యక్తి మృతి

కుదేలవుతున్న టైలరింగ్ రంగం



7

జిల్లాను నాటుసారా రహితంగా మారుద్దాం

● కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చడమే నవోదయం 2.0 ప్రధాన ఉద్దేశ్య మని, ఆ దిశగా నాటుసారాను నిర్మూలించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశిం చారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలన కార్యక్రమం నవోదయం 2.0 పై ఎస్పీ అశోక్‌కుమార్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడులతో కలిసి కలెక్టర్ జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం నెరవేరేలా క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో అవగాహన సదస్సులు, ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఐడీ లిక్కర్ (అక్రమ స్వేదన మద్యం) పీడిత గ్రామాల జాబితాను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించామని, ఏ కేటగిరీలో 1 గ్రామం, బీ కేటగిరీలో 8 గ్రామాలు, సీ కేటగిరీలో 1 గ్రామాన్ని గుర్తించినట్లు తెలిపారు. నిఘా ఎన్‌ఫోర్స్‌మెంటు బృందాలు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా నాటుసారా, గంజాయి సరఫరా వంటి సమాచారం తెలిస్తే టోల్‌ఫ్రీ నెంబరు 14405కు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవోలు జాన్‌ఇర్వీన్, సాయిశ్రీ, చంద్రమోహన్, జడ్పీ సీఈవో ఓబులమ్మ, ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనరు చంద్రశేఖర్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, డీపీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ అశోక్‌కుమార్

జిల్లాలో తాగునీటి ఎద్దడిని అధిగమించాలి

జిల్లాలో తాగునీటి కొరత లేకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం బోర్డు మీటింగ్ హాలులో తాగునీటిపై ఇరిగేషన్ ఆర్‌డబ్ల్యుఎస్, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీటి వనరులను గుర్తించి గ్రామ, పట్టణ ప్రాంతాల్లో నీటి కొరత లేకుండా చూడాలన్నారు. ఎక్కడా ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకూడదని, నీటి సరఫరాకు ఇబ్బందులు ఉంటే వెంటనే బోర్లు, మోటార్లు, పైపులు మరమతులు చేప ట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనరు మనోజ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఏడు కొండలు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

కలలు కనండి.. వాటిని సాకారం చేసుకోండని.. శాస్త్రవేత్త అబ్దుల్ కలాం మాటలు కడప జిల్లా విద్యార్థులు అక్షరాలా ఒంటబట్టించుకున్నారు. విభిన్న ఆలోచనలతో సృజనకు పదునుపెట్టి సరికొత్త ఆవిష్కరణలతో తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. దైనందిన జీవితంలో తరచూ ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలను ప్రయోగాత్మకంగా వివరిస్తున్నారు. కొన్నేళ్లుగా జాతీయస్థాయిలో తమ ప్రతిభ ప్రదర్శిస్తున్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా జాతీయ స్థాయికి ఎంపికైన నమూనాలపై ప్రత్యేక కథనం.

-కడప ఎడ్యుకేషన్, (ఆంధ్రజ్యోతి)

చిట్టి బుర్రలు.. పెద్ద ఆవిష్కరణలు..

● నేడు జాతీయ సైన్స్ దినోత్సవం

రైప్ ఫ్రూట్ ఐడెంటిఫైర్..



షాపింగ్ మాల్స్ సూపర్‌మార్కెట్లలో పండ్లు కొనేట ప్పుడు అవి ఇంకా పండాయా, పచ్చిగానే ఉన్నాయా అన్నది గుర్తించడం కష్టం. పండును తాకి చూడడం, ఒత్తిచూడడం వంటి వాటికి దుకాణాల వారు అంగీ కరించరు. కాబట్టి పడును తాకకుండానే అది మాగిన పండు అని తెలుసుకోవడం కోసం ఈ పరికరాన్ని రూపొందించారు. ఈ ప్రాజెక్టులో ఉపయోగించిన గ్యాస్ సెన్సార్ మాగిన పండ్ల నుంచి వెలువడే ఎథిలీన్ వాయువును గుర్తించి ఆ పండు మాగినదైతే రైప్ ఫ్రూట్ అని.. పచ్చిదైతే రా ఫ్రూట్ అని డిస్ప్లేలో ప్రదర్శిస్తుంది.

- జి.విజిత్ అభిలాష్, విద్యార్థి, నాగార్జున మోడల్ పాఠశాల

అలారం టూ సేవ్ లైఫ్ అండ్ లింబ్స్



మూతలేని మ్యాన్ హోల్స్ డ్రెయినేజీల కారణంగా ప్రమా దాల బారిన పడ కుండా పాదచారులు, వాహనదారులను హెచ్చరిస్తుంది. ఇందులో ఉపయోగించిన ఐఓటీ ఆధారిత సెన్సార్ పరిమిత దూరంలో ఉన్న మ్యాన్‌హోల్ దగ్గరకు వచ్చే ప్రజలను అప్ర మత్తం చేస్తుంది. ఈ పరికరాన్ని ధరించిన మనిషి, లేదా వాహనం మూతలేని మ్యాన్ హోల్ వద్దకు వస్తున్నపుడు ఆటోమేటిక్‌గా అప్రమత్తం చేస్తుంది.

- షేక్ అసిఫా, చైల్డ్ సైంటిస్ట్

విజన్ అలర్ట్..



సెల్‌ఫోన్ వినియోగం కారణంగా అన్ని వయ సుల వారిలోనూ దృష్టి లోపాలు అధికమైన విషయం తెలిసిందే. సెల్‌ఫోన్ వాడడం కారణంగా కంటి చూపునకు ఇబ్బందులు ఏర్పడ కుండా ఈ విజన్ అలర్టర్ హెచ్చరి స్తుంది. ఈ ఆవిష్కరణ కచ్చితంగా కంటి చూపును నియంత్రించడానికి సహాయ పడుతుంది.

- హిట్లర్ జైన్, విద్యార్థి, నాగార్జున మోడల్ స్కూల్ కడప

ఐఓటీ స్మార్ట్ మిర్రర్



మల్టీమీడియా, ఇంటర్‌నెట్ కనెక్టివిటీ ఫీచర్లతో కూడిన అధునాతన అద్దం. వార్తల నవీకరణ, వాతావరణ సూచన, ఉష్ణోగ్రతలు వంటి నిజ సమయ సమాచారాన్ని అందిస్తుంది. సొగసైన డిజైన్, ఇంటరాక్టివ్ డిస్‌ప్లేతో, ఈ స్మార్ట్ మిర్రర్స్ ఆధునిక గృహాల్లో అంతర్భాగంగా మారుతు న్నాయి. వార్తలు, వాతావరణ అప్‌డేట్‌లు, వాతావరణ సూచనలు ఈ అద్దం ఉపరితలంపై నేరుగా ప్రదర్శితమవుతాయి.

- రుగ్వేద వర్మ, విద్యార్థి, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల కమలాపురం



గంగమ్మ తల్లీ... పాహిమాం...

నేటి నుంచి అనంతపురం గంగమ్మ జాతర

భక్తుల కోర్కెలు తీర్చే అనంతపురం గంగమ్మతల్లి జాతర శివరాత్రి పర్వదినం ముగిసిన రెండో రోజు మాఘమాసం భహుళ అమవాస్య నుంచి అత్యంత వైభవంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అమ్మవారు తన పుట్టినిల్లు (చాగలగుట్టపల్లె) నుంచి సాంప్రదాయ పద్ధతిలో ఊరేగింపుగా బయలుదేరి.. అనంతపురం గ్రామంలోని ఆలయానికి చేరుకోగానే జాతర ప్రారంభమవుతుంది. మూడు రోజుల పాటు జరిగే జాతరకు ఉమ్మడి కడప జిల్లా నుంచే కాకుండా రాయల సీమలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారు.

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం గ్రామంలో వెల సిన గంగమ్మ జాతరను ఏడాది ఈనెల 28వ తేదీ శుక్రవారం నుంచి మార్చి 2వ తేదీ ఆదివారం వరకు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా అమ్మవారికి మొక్కు బడులు ఉన్న వారు దీలు, బోనా లు సమర్పిస్తారు. కుంకుమబండ్లు,



అనంతపురం గంగమ్మ ఆలయం

చాందీని బండ్లు కట్టి ఆలయం చుట్టూ ప్రదర్శిస్తారు. ఇక జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్య క్రమాలు హరికథలు, చెక్కభజనలు, కేరళ డ్రమ్స్ వాయిద్యాలు, కళాకారు ల హస్య నటనలు, నృత్యాలు ఉంటాయి. అలాగే ఎద్దులకు బండలాగుడు పోటీలు నిర్వహించి విజేతలకు బహు మతులు అందజేస్తారు. కాగా, జాత రకు వచ్చే భక్తుల కోసం నిర్వాహకు లు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారి దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు, ఎండలకు భక్తులు ఇబ్బందులు పడకుండా చలువపందిళ్లు, మహిళలకు ప్రత్యేక టాయిలెట్లు, స్నాన వాటికలు ఏర్పాటు చేశారు. ఇక జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అమ్మవారి చరిత్ర

కర్నాటక రాష్ట్రంలోని అండి అనే ఊరు నించి గంగిరెద్దుల వారి ద్వారా అనంతపురం గ్రామంలో వెలసినట్లు పూర్వీకులు చెబుతారు. జాతరకు సమీపంలోని ప్యారంపల్లె అనే గ్రామంలోని తిమ్మిరెడ్డి ఉత్తారెడ్డి అనే రైతు పొలానికి కంచె వేయడానికి కంపచెట్లు కొట్టించి తొడుగులు వేయిస్తారు. కంప తొడుగును ఎద్దులకు కట్టి లాగిస్తే ఎంత సేపటికి కదలదు. ఆరోజు రాత్రి ఉత్తారెడ్డికి స్వప్నంలో అమ్మవారు ఈ ప్రాంతంలో వెలశానని.. కూలి పనికి వచ్చిన చెల్లు వంశీయులను పూజార్లుగా పెట్టి పూజలు నిర్వహించాలని చెప్పినట్లు పూర్వీకులు చెబుతారు. దీంతో అప్పటి నుంచి అమ్మవారికి బ్రాహ్మణులు కాకుండా చెల్లు వంశీయులు, యాదవులు పూజార్లుగా పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

జాతరకు చేరుకునే మార్గాలు

కడప-రాయచోటి నుంచి వచ్చే భక్తులు రామాపురం మండలం చిట్లూరు క్రాస్ వద్ద నుంచి గంగమ్మ జారతలోకి చేరుకో వచ్చు. రాయచోటి-వేంపల్లె నుం చి వచ్చే వారు రవీంద్రనగర్ మర్రిచెట్ట వద్ద నుంచి గానీ.. లక్కిరెడ్డిపల్లె రాచపల్లె నుంచి జాతరలోకి రావచ్చు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య


జమ్మలమడుగు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రైల్వేస్టేషన్‌లో గురువారం తెల్లవారుజామున దండే హరీష్‌రెడ్డి (27) అనే యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటన జరిగిన వెంటనే అక్కడున్న కొందరు రైల్వేస్టేషన్ సిబ్బందికి సమాచారం తెలియజేయడంతో వారు ఎర్రగుంట్ల, జమ్మలమడుగు అర్బన్ పోలీసులకు విషయం తెలిపారు. వారు మృతదేహాన్ని పరిశీలించి.. సెల్‌ఫోన్, ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడు కర్నూలు జిల్లా ఉయ్యాలవాడ మండలం కాకరవాడ గ్రామానికి చెందిన రాజమహేంద్రారెడ్డి కుమారుడిగా గుర్తించారు. సమాచారాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. కాగా, ఆ యువకుడికి ఉద్యోగం రాకపోవడంతో ఆత్మహత్య చేసుకున్నట్లుగా కుటుంబ సభ్యులు పోలీసులకు తెలియజేశారు. అయితే మృతుడు ఆత్మహత్య చేసుకోవడానికి ఇంకా ఏవైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలో విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సికెదిన్నె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కడప-రాయచోటి జాతీయ రహదారిలోని మద్దిమడుగు బిడికి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వెంకట సుబ్బయ్య (45) మృతి చెందాడు. పోలీసుల వివ రాల మేరకు.. రామాపురం మండలం శివశంకరాపురం గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య పనిమీద ద్విచక్ర వాహనంలో కడపకు వస్తుండగా ఆర్టీసీ బస్సు వెనుకవైపు నుంచి ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం 108లో రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు.

శేషాచలంలో ఆదిమానవుల ఆనవాళ్లు!





చిత్రాలను చూపుతున్న తిరుపతి జిల్లా పశుసంవర్ధకశాఖ ఏడీ గోవిందరాజుభాస్కర్, శేషాచలం అడవిలో రాళ్లపై ఆదిమానవులు గీసిన జంతువుల చిత్రాలు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శేషాచలం అడవుల్లో ఆదిమానవుల ఆనవాళ్లు అనేకం ఉన్నాయి. ఈ అటవీ ప్రాంతంలోని రాళ్లపై కనిపిస్తున్న చిత్రాలు మన దేశంలో ప్రాచీన మానవ జాడలను తెలియజేస్తున్నాయి. అప్పటి మానవుల జీవన శైలిని, విశ్వాసాలను అర్థం చేసుకునే మార్గాన్ని చూపుతున్నాయి. చెందిన ప్రాచీన మానవుడి సృజనాత్మకత, ప్రకృతితో అతని అనుబంధాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఇవి మానవ నాగరికత పరిణామాన్ని అర్థం చేసుకునేందుకు విలువైన సమాచారాన్ని అందిస్తాయి. శేషాచల అడవుల్లోని పితృగల తీర్థం, యుధాగాల తీర్థం దగ్గర ఉన్న ఈ చిత్రాలను తిరుపతి జిల్లాకు పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ గోవిందరాజుల భాస్కర్ వీటిని గుర్తించారు. ఈ చిత్రాలు అప్పట్లో ఈ అడవిలో ఉన్న జంతువుల గురించి చెపుతున్నాయని ఆయన వివరిస్తున్నారు.

ఈ చిత్రాలు సుమారు మెసోలిథిక్ కాలం (10,000 బీసీ - 8000 బీసీ) నాటివిగా భావిస్తున్నారు. జంతువుల చిత్రాల్లో జింక లు, గేదెలు, పక్షుల చిత్రాలు కనిపిస్తున్నా యి. వేటాడటం, ఆచారాలు పాటించడం వంటి చిత్రాలు ఆ కాలపు జీవన విధానాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఆది మానవుడు ప్రకృతి నుంచి వచ్చిన ఎరుపు, పసుపు రంగు లు ఉపయోగించి ఈ చిత్రాలను సృష్టించా డు. ఇలాంటి చిత్రాలు తిరుమల సమీ పంలోని అడవుల్లో కూడా ఉన్నాయి. వాతావరణ ప్రభావంతో క్రమేణా ఈ చిత్రాలు నాశనమౌతున్నాయి. ఈ చిత్రాల పరిరక్షణకు అధికారులు కృషి చేయాల్సి ఉందని చరిత్ర పరిశోధకులు కోరుతున్నారు.. రైల్వేకోడూరు మండలం పూర్తిగా శేషాచలం అడవులను ఆనుకుని ఉంది.

ఈ అడవుల్లోని బండలపై ఆదిమానవుడు గీసిన చిత్రాలు చరిత్ర పరిశోధకులు, ప్రకృతి ప్రియులను ఆకర్షిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఈ చిత్రాలు దట్టమైన అడవుల్లో ఉండడంతో అందరికీ అందుబాటులో లేవు అధికారులు స్పందించి ఈ చిత్రాలను కాపాడే ప్రయత్నం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పరి శోధకులు, ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

- సిరిబండి కింద పడి వ్యక్తి మృతి
- ఆర్.తుమ్మలపల్లిలో విషాదం

చింతల గంగమ్మజాతరలో అపశ్రుతి



మృతి చెందిన సుదర్శన్

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్ర జ్యోతి): పులివెందుల మండల పరిధిలోని ఆర్.తుమ్మలపల్లి సమీపంలో గురువారం జరిగిన చింతల గంగమ్మ జాతరలో అపశ్రుతి చోటు చేసుకుంది. సిరిబండి ఊరేగింపు మహోత్సవంలో సిరిబండి కింద పడి ఆర్.తుమ్మలపల్లి గ్రామంలోని హరిజనవాడకు చెందిన ఎం.సుదర్శన్ (62) అలియాస్ గుండు మృతి చెందాడు. చింతల గంగమ్మ జాతరలో ఈ మూడేళ్లలో సిరిబండి కిందపడి మృతి చెందడం రెండోసారి. ప్రతి ఏడాది మహా శివర్రాతి పర్వదినం మరుసటిరోజు అంగరంగ వైభవంగా చింతల గంగమ్మ జాతర జరుగుతుంది. రెండేళ్ల క్రితం జడ్పీటీసీ సభ్యుడు మహేశ్వరరెడ్డి సిరిబండి కిందపడి మృతి చెందిన విషయం మరువకముందే మళ్లీ ఏడాది తరువాత మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఆర్.తుమ్మలపల్లిలో సిరిబండి ఊరేగింపు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు బండి కింద పడడంతో బండిగాను సుదర్శన్ నడుముల మీద ఎక్కి పోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే గమనించిన గ్రామస్తులు సుదర్శన్‌ను హుటాహుటిన చికిత్స కోసం పులివెందులలోని వైఎస్ఆర్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎం.సుదర్శన్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



జాతరలో సిరి బండి లాగుతున్న గ్రామప్రజలు

వైభవంగా జరిగిన జాతర

సిరిబండి జాతరలో అపశృతి ఏర్పడినప్పటికీ జాతర వైభవంగా సాగింది. ఆర్.తుమ్మలపల్లె గ్రామం నుంచి చింతల గంగమ్మ దేవస్థానం వరకు ఊరేగింపు నిర్వహించారు. గంగమ్మ దేవస్థానం వద్ద జాతర సందర్భంగా అమ్మవారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టుపక్కల గ్రామాలతో పాటు జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు పొడిగింపు

కడప కలెక్టరేట్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో కాల పరిమితిని మూడు నెలల పాటు 2025 మార్చి 1 నుంచి మే నెల వరకు పొడగించినట్లు డీపీఆర్వో వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా గురువారం ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

జిల్లాలో ఫిబ్రవరి 28 వరకు అక్రిడిటేషన్ కార్డుల గడువు కలిగి ఉన్న పాత్రికేయులకు మాత్రమే పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందన్నారు. సంబంధిత మీడియా యాజమాన్యాలు సంస్థలో పనిచేస్తున్న, తొలగించిన జర్నలిస్టుల వివరాలు జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖ అధికారి, కడప కార్యాలయానికి అందజేయాలని ఆ ప్రకటనలో డీపీఆర్వో కోరారు.

కుదేలవుతున్న టైలరింగ్ రంగం

- రెడిమేడ్‌వైపే ప్రజల ఆసక్తి
- డిజైనింగ్ బ్లౌజులపై మగువల మక్కువ
- నేడు టైలరింగ్ దినోత్సవం

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు వేలాది కుటుంబాలు దర్జీ పనిపై ఆధారపడి జీవించేవి. అయితే కుట్టు కూళ్ల భారం కావడంతో టైలర్ వద్ద బట్టలు కుట్టించేందుకు ప్రజలు వెనకడుగు వేస్తున్నారు. మరోవైపు రెడిమేడ్ బట్టలు విరివిగా రావడంతో యువత దానిమీద మోజుతో ఎక్కువ ఆసక్తి చూపిస్తూ కొనుగోలు చేయడం వల్ల దర్జీల దగ్గర బట్టలు కుట్టించుకునే వారు తక్కువ అవుతున్నారు. ఈ క్రమంలో టైలరింగ్ రంగంపై ఆధారపడిన వారి వృత్తికి ఆటంకం ఏర్పడుతోంది. వాస్తవంగా టైలర్ వద్ద ఒక ప్యాంట్, షర్టు కుట్టించుకుంటే రూ.1000 నుంచి రూ.1300 వరకు కూలి చెల్లించాల్సిన పరిస్థితి ఉంది. కేవలం కుట్టుకూలితోనే రెడిమేడ్ వస్త్రాలు రావడం వల్ల వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజల ఆసక్తి చూపుతున్నారు. బట్టలు కుట్టడానికి అవసరమైన ముడిసరుకు కాన్వాసు, గుండీలు, హుక్కులు, దారాలు తదితర వస్తువులతో పాటు టైలరింగ్ షాపు బాడుగలు, కరెంటు బిల్లులు, నిర్వహణ భారం కావడంతో కుట్టుకూలీ ధర పెంచక తప్పడం లేదని టైలర్లు చెబుతున్నారు. అదేవిధంగా పండుగ వేళల్లో దర్జీల దగ్గర బట్టలిచ్చి కుట్టించుకునేంత సమయం లేకపోవడం వల్ల కూడా రెడిమేడ్ దుస్తుల కొనుగోళ్లపై ఆసక్తి చూపుతున్నారు.

డిజైనింగ్ బ్లౌజులపై మక్కువ

ఒకానొక సందర్భంలో మగవారికి సంబంధించిన దుస్తులు కుట్టడంలో దర్జీలకు తగినంత పని లేనప్పటికీ మహిళలకు సంబంధించిన దుస్తులు కుట్టేందుకు డిమాండ్ ఏర్పడింది. వివిధ రకాల డిజైన్లు, వర్క్‌ల వల్ల మహిళా టైలర్లకు చేతినిండా పని లభిస్తుంది.



ఒక బ్లౌజ్‌కు రూ.500 నుంచి రూ.1000 వరకు కుట్టుకూలి చెల్లిస్తున్న పరిస్థితి ప్రస్తుతం నడుస్తోంది. డిజైనింగ్, బొటిక్ పేర్లతో మహిళా టైలరింగ్ షాపులు నడుస్తున్నాయి. వర్క్ బ్లౌజ్‌పైన ఎక్కువ మంది మొగ్గు చూపడంతో డిజైనింగ్ బ్లౌజులకు మంచి డిమాండ్ ఉంది. బొటిక్ షాపుల నిర్వహణ కోసం కొన్ని సవాళ్లను ఎదు ర్కోవాల్సిన పరిస్థితులు కూడా లేకపోలేదు. ఇందులో ప్రధానంగా బొటిక్ షాపును జనసంచారం ఎక్కువగా ఉండే చోట ఏర్పాటు చేసుకోవాలి. దీని వల్ల అద్దె ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. ఇక ఫ్యాషన్ పరిశ్రమ నిరంతర మారుతూ ఉంటుంది. తాజా ట్రెండ్స్ అనుసరించడం పోటీకి యజమానులకు ఒక సవాల్‌గా నిలుస్తుంది. అందుకోసమే వర్క్, డిజైన్ దుస్తుల కూలి రేటు కూడా ఎక్కువగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. కాగా, సమాజంలో అన్ని రంగాల వారికి ప్రత్యేకమైన గుర్తింపునిచ్చి ప్రోత్సహిస్తున్న ప్రభుత్వాలు టైలరింగ్ రంగంలో రాణిస్తున్న వారిని కూడా గుర్తించి తగిన విధంగా ప్రోత్సహించాలనే అభిప్రాయం దర్జీల నుంచి వ్యక్తమవుతోంది.



కస్టమర్లు వెతుక్కుంటూ రావాలి



32 సంవత్సరాలుగా పైగా టైలరింగ్ రంగం లో ఉన్నాను. దర్జీలకు కొంతవరకు ఆదరణ తగ్గింది నిజమే. మన పనితీరే కస్టమర్లను ఆకట్టుకుంటుంది. కస్టమర్ల కోసం మనం ఎదురు చూడకూడదు. కస్టమర్లే మనను వెతుక్కుంటూ రావాలి. అందుకు అనుగుణంగా కుట్టు పనులలో నైపుణ్యం పెంచుకోవాలి.

-అర్జున్ టైలరింగ్ మాస్టర్, కడప

నెల ముందే దుస్తులు ఇచ్చేవారు



రెడిమేడ్ రంగం రాకముందు నెలరోజుల ముందే దుస్తులు తీసుకొచ్చి ఇచ్చేవారు. పండుగ సీజన్‌లో వస్తే వారం ముందు నుంచే కస్టమర్ల నుంచి దుస్తులు తీసు కెళ్లేవాళ్లం కాదు. కానీ పరిస్థితులు ఇపు డు మారిపోయాయి. రెడిమేడ్ రంగం రావడంతో టైలర్లకు కష్టకాలం మొదలైంది.

-గౌస్ టైలరింగ్ మాస్టర్, కడప

కొత్త ప్రయోగాలతో ముందుకు సాగాలి

- ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్



ప్రయోగాలను పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న వీసీ విజయ్‌కుమార్

వేంపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టి సమాజానికి ఉపయోగపడేవిధంగా కొత్త ప్రయోగాలు చేయాలని ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్ సూచించారు. మండలంలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో అభియంత్ ఫెస్ట్-2025 కార్యక్రమాన్ని గురువారం వీసీ ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా ఆయా ల్యాబ్ కాంప్లెక్స్‌లలో సుమారు 20 మంది బృందాలుగా ఏర్పడి ప్రయోగాలను తయారు చేశారు. వాటిని పరిశీలించిన వీసీ పనితీరును అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కొత్తకొత్త ప్రయోగాలు చేసే వారికి ఆర్జీయూకేటీ చేయూతనిస్తుందని, ఆ దిశగా మరిన్ని ప్రయత్నాలు చేయాలన్నారు. అనంతరం ఫుడ్‌కోర్టులను సందర్శించారు. కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మైదుకూరు ఎద్దులకు మొదటి బహుమతి



బండలాగుతున్న ఎద్దులు

చాపాడు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవాలయం వద్ద గురువారం నిర్వహించిన రాష్ట్రస్థాయి బండలాగుడు ఎద్దుల పోటీలు రసవత్తరంగా సాగాయి. ఈ పోటీల్లో మైదుకూరు పట్టణానికి చెందిన కుర్రా వెంకటేష్‌యాదవ్ ఎద్దులు 2049 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.1,00,116 గెలుచుకున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దులు 1920 అడుగులు లాగి రెండో బహుమతి రూ.70,116, రంగసాయిపల్లె గ్రామానికి చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఎద్దులు 1896 అడుగులు లాగి మూడో బహుమతి రూ.60 వేలు గెలుచుకున్నట్లు తెలిపారు. ఈనెల 26 నుంచి రెండు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణ, దేవస్థానం ఈవో శ్రీనివాసులు, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ దార్శల గురివిరెడ్డి, టీడీపీ నాయకులు మేకల బాబు, వీరనారాయణ, కార్తీకొరెడ్డి, గోసుల క్రిష్ణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, తదితరులు బహుమతులను పంపిణీ చేశారు.

పొలతల క్షేత్ర శివరాత్రి ఉత్సవాల ఆదాయం రూ.27,01,818లు



కానుకలను లెక్కిస్తున్న భక్తులు.సేవకులు

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పొలతల క్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాల ఆదాయం రూ.27,01,818లు వచ్చినట్లు ఆలయ ఈఓ కృష్ణానాయక్ తెలిపారు. ఆలయంలో గురువారం ముగింపు ఉత్సవాలను అర్చకులు నిర్వహించారు. లడ్డు ప్రసాదాల విక్రయం ద్వారా రూ.4,50,000లు, సేవా టికెట్ల ద్వారా రూ.12,03,520, దుకాణాల ద్వారా రూ.74,000, తాత్కాలిక హుండీల ద్వారా రూ.10,47,798లు వచ్చినట్లు ఈఓ తెలిపారు. శుక్రవారం శాశ్వత హుండీలను లెక్కించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గండి దేవస్థాన ఈఓ వెంకట సుబ్బయ్య, ఆలయ సిబ్బంది, పోలీసులు, సేవకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం : అంజద్‌బాషా

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని, కేవలం రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ ఉపముఖ్యమంత్రి ఎస్.బి.అంజద్‌బాషా తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విమర్శలను కూటమి ప్రభుత్వం తట్టుకోలేకపోతోందన్నారు. అందుకే పోసానిని అరెస్టు చేశారన్నారు. పోలీసులను రాజకీయ కక్షలకు వాడుకుంటున్నారని మండిపడ్డారు. రాత్రి సమయంలో ఆరోగ్యం బాగలేదని చెబుతున్నా పోసానిని అరెస్టు చేయడం దారుణమని, ఆయన అరెస్టును ఖండిస్తున్నట్లు తెలిపారు.

రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలు పరిష్కరించాలి

సికెదిన్నె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని తహసీల్దారు నాగేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నె పంచాయతీ సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆదిరాజు, వీఆర్వో ప్రవీణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కడప క్రైం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సెవెన్‌రోడ్స్ సర్కిల్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ జావేద్ సిబ్బందితో సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మైదుకూరు మండలం వనిపెంటకు చెందిన షేక్ బాషామొహిద్ (75) రాత్రి రోడ్డు దాటుతున్న సమయంలో పాత బస్టాండు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఆయన తలపై బస్సు టైర్ ఎక్కడంతో నుజ్జునుజ్జు అయింది. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

ఫుట్‌పాత్‌పై తొలగిన అడ్డంకులు

కడప ఎన్టీఆర్ సర్కిల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌పై అడ్డంకులు తొలిగాయి. సెవెన్ రోడ్స్‌కూడలి నుంచి గోకుల్ సర్కిల్ మధ్యలో ఉన్న వ్యాపా రులు కొంతమంది తమ దుకాణం ముందు వస్తువులు ఉంచడంతో పాద చారుల రాకపోకలకు ఇబ్బంది ఉండేది. దీనిపై ఆంధ్రజ్యోతిలో ఆక్రమణల్లో ఫుట్‌పాత్‌లు, అవస్థల్లో ప్రజలు అనే శీర్షికన ఈనెల 25న వార్త ప్రచురించడం జరిగింది. వార్తకు స్పందించి నగర పాలక సిబ్బంది ఆక్రమణలు తొలగించారు.

కనులపండువగా కల్యాణం

● సంగమేశ్వర ఆలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ● కడప సోమసుందరేశ్వరస్వామికి పుష్పాభిషేకం





ప్రత్యేక అలంకరణలో పార్వతీపరమేశ్వరుల ఉత్సవమూర్తులు.. మంగళసూత్రం చూపిస్తున్న దృశ్యం

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనిమెల గ్రామ సమీపాన ఉన్న సంగమేశ్వరాలయంలో శివరాత్రి సందర్భంగా గురువారం ఉదయం పార్వతీపరమేశ్వరుల కల్యాణం కమణీయంగా జరిగింది. నర్రెడ్డి మురళీమోహన్‌రెడ్డి, సుబ్రమణ్యశర్మ ఆధ్వర్యంలో వేద పండితులు పార్వతీపరమేశ్వరుల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. డప్పువాయిద్యాల మధ్య పండితుల వేదమంత్రాలతో స్వామి వారి కల్యాణం అంగరంగవైభవంగా జరిగింది. స్వామివారి కల్యాణం చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కన్నులపండువగా పుష్పాభిషేకం

కడప కల్చరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని గడ్డిబజారులో వెలసిన కామకోటి కాలాంబదేవి సమేత సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో గురువారం కన్నులపండువగా పుష్పాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు పుష్పాలను అందించారు.



స్వామివారికి పుష్పాభిషేకం చేస్తున్న దృశ్యం

ఉన్నత లక్ష్యాలతో ముందుకు వెళ్లాలి

● ఆత్మహత్యలు వద్దు.. బతికి సాధించాలి : జేసీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

కడప (వినాయకనగర్), ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆత్మహత్యలు మాని బతికి సాధించాలని, ఉన్నత లక్ష్యాలతో బంగారు భవిష్యత్తును ఎంచుకోవాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ అన్నారు. ఆత్మహత్యలు వద్దు బతికి సాధిద్దామని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా శాఖ రూపొందించిన పోస్టర్‌ను గురువారం కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ విద్యార్థులు అనవసరమైన భయాందోళనలు, అవమానాలు, చదువు ఒత్తిడితో ఆత్మస్థైర్యాన్ని కోల్పోకూడదన్నారు. తొందరపాటు నిర్ణయాలతో అఘాయిత్యాలకు పాల్పడకూడదని సూచించారు. కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేశు, ప్రధాన కార్యదర్శి హమీద్, కార్యదర్శి అక్షయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు నవీన్, రఘు, లక్ష్మణ్, పక్రుద్దీన్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

● హిందూ ఐక్యవేదికలో చెన్నూరు నేతలు

చెన్నూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మేజరు పంచాయతీ చెన్నూరు ఆక్రమణలకు నిలయమెందని, ప్రధాన రోడ్డులో సైతం ఇష్టానుసారంగా ఇరువైపులా చిన్నపాటి దుకాణాలు ఏర్పాటు చేసుకుని వారి ఆదాయానికి మార్గం ఏర్పాటు చేసుకుని ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తున్నారని హిందూ ఐక్యవేదిక సభ్యులు ప్రశ్నించారు. చెన్నూరు పార్కు ఆవరణలో గురువారం పార్టీలకతీతంగా నిర్వహించిన సమావేశంలో మాజీ సర్పంచ్, జిల్లా సమరసత సేవా సంస్థ నేత జీవన్ భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివరామిరెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు కందుల విజయభాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ఆకుల ప్రసాద్ మాట్లాడారు. ఆర్అండ్‌బి రోడ్డులో ఇరువైపులా ఇష్టానుసారంగా ఆక్రమణలు పెరిగి ప్రజల రాకపోకలకు అడ్డంకులు ఏర్పడే పరిస్థితి వస్తుందన్నారు. చెన్నూరు పోలీసుస్టేషన్ పరిధి నుండి కొండపేట రోడ్డు వరకు పరిస్థితి దారుణంగా ఉందన్నారు. పంచాయతీ అధికారులు ఈ ఆక్రమణలు తొలగించాలన్నారు. నిబంధనల ప్రకారం ఏ నిర్మాణం చేపట్టాలన్నా అనుమతులు తప్పనిసరి అని, కానీ స్థానిక ఖిల్లా మసీదులో గదుల నిర్మాణాన్ని ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. అనంతరం ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌రెడ్డికి నేతలు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఐక్యవేదిక నేతలు అతికారి రవికుమార్, మునిసుబ్బారెడ్డి, నీలం వెంకటసుబ్బారెడ్డి, నీలం గోవిందరెడ్డి, రెడ్డిప్రసాద్, రామిరెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు గోదిన శ్రీనివాసులు, శ్రీరామమూర్తి, ముదిరెడ్డిసుబ్బారెడ్డి, పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా పొలానికి దారి చూపించండి సారూ..

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మా పొలానికి దారి చూపించాలని పలుమార్లు జిల్లా కేంద్రానికి వెళ్లి స్పందనలో అర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదని గుజ్జుల సురేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కమలాపురంలో మీడియా ఎదుట మండలంలోని నసంతపురానికి చెందిన సురేశ్ తన గోడును వెల్లబోసుకున్నాడు. తాను కిడ్నీ పేషంటునని, తన అక్క పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసి జీవనం సాగిస్తున్నానని తెలిపారు. తన అక్క పొలంలోకి వెళ్లే దారిని ఓ కానిస్టేబుల్ ఆక్రమించి దారి లేదని బెదిరిస్తున్నాడని వాపోయాడు. అలాగే తమ గట్టులో ఉన్న రాతిబండలు పగులగొట్టాడన్నారు. దీంతో తన పొలం బీడుగా ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు స్పందించి తనకు పొలంలోకి వెళ్లడానికి దారి చూపి ఆదుకోవాలని కోరాడు.

ప్రత్యేక నిధులు కేటాయించాలి

● వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నేతలు

కడప మారుతీనగర్ ఫిబ్రవరి 27, (ఆంధ్రజ్యోతి): వచ్చే మార్చినెలలో జరుగనున్న రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. పెండింగ్‌లో వున్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. గోదావరి, కృష్ణ, పెన్నా నదుల అనుసంధానం పేరుతో రూ.80వేల కోట్లతో పథకం రూపొందించి కేంద్రప్రభుత్వ ఆమోదం కోసం, నిధుల సహాయం కోసం పంపుతున్నట్లు ప్రకటించిందని, ఈ పథకం ద్వారా 385 టీఎంసీల నీటిని కృష్ణకు మళ్లించి రాయలసీమ నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సాగునీరు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం చెబుతున్నతీరు అవివేకమన్నారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర నాయకులు నారాయణ, బసిరెడ్డి, మాల కొండయ్య, సీఆర్వీ ప్రసాద్, దేవరశ్రీకృష్ణ, జయవర్ధన్, సుబ్బరాయుడు, అంజి, అశోక్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గుర్రప్ప, రవిశంకర్‌రెడ్డి, పాల్గొన్నారు.

కోర్టు ఉత్తర్వులు అమలు చేయాలి

● వీసీకి తాత్కాలిక అధ్యాపకుల వినతి

వేంపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వుల మేరకు 110 జీవోను అమలు చేసి న్యా యమైన పనికి సమాన వేతనం ఇప్పించాలని ఆర్జీయూకేటీ వైస్ చాన్సలర్ విజయ్‌కుమార్‌కు తాత్కాలిక అధ్యాపకులు విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ ప్రతినిధులు గురువారం వీసీని కలిసి వినతి పత్రం ఇచ్చారు. 110 జీఓ ప్రకారం జీతాలు ఇవ్వాలని ఉత్తర్వులు ఇచ్చినా ఆర్జీయూకేటీ అమలు చేయడం లేదని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గవర్నింగ్ కౌన్సిల్‌లో చర్చించి సమస్యకు పరిష్కారం చూపుతామని వీసీ హామీ ఇచ్చినట్లు తాత్కాలిక అధ్యాపకులు తెలిపారు.

2న మెగా ఉచిత వైద్యశిబిరం

వల్లూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంటు సొసైటీ ఆధ్వర్యంలో మార్చి 2న ఆదివారం మండల పరిధిలోని గణేశ్‌పురంలో కడప మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వారు మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. ఈ వైద్యశిబిరంలో క్యాన్సర్‌కు సంబంధించి డాక్టర్ వంశీవిహారితో పాటు స్త్రీవ్యాధుల వైద్యనిపుణురాలు డాక్టర్ సాయిచరిత పాల్గొంటారని, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు జానమద్ది హనుమచ్ఛాస్త్రి వర్ధంతి

కడప కల్చరల్, ఫిబ్రవరి 27, (ఆంధ్రజ్యోతి): డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి వర్ధంతి వేడుకను ఈనెల 28వ తేదీ మధ్యాహ్నం 2.30 గంటలకు స్థానిక సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైవీయూ వైస్ చాన్స్‌లర్ ఆచార్య పణితి ప్రకాశ్‌బాబు హాజరవుతారని, అలాగే తెలుగు పద్య వైభవం-శబ్ద సౌందర్యం అనే అంశంపై రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు ఆచార్య పీఆర్ హరినాథ్ ఉపన్యాసం ఉంటుందన్నారు.

ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సేవలను సులభతరం చేయడం కోసం భూమి గల ప్రతి రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యను ఇవ్వడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారిణి సరస్వతి తెలిపారు. గురువారం మండల పరిధిలోని సంబటూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులనుద్దేశించి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అందించే ఈ ప్రత్యేక గుర్తింపు కార్డుల కోసం ముందుగా ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు జబీరుద్దీన్, రైతులు పాల్గొన్నారు.

గడువులోపు ట్రేడ్ లైసెన్సులు రెన్యువల్ చేసుకోవాలి

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): కమలాపురం పట్టణ పరిధిలో ఉన్న వ్యాపారస్తులు తమ ట్రేడ్ లైసెన్సులను ఈనెల 28వ తేదీలోపు పెనాల్టీ లేకుండా రెన్యువల్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనరు పగడాల జగన్నాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1వ తేదీ నుంచి 25 శాతం పెనాల్టీతో రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

నిర్మాణాల రెగ్యులరైజేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

వల్లూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): 2019 కన్నా ముందు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్నవారు ఆయా నిర్మాణాల రెగ్యులరైజేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ శ్రీవాణి తెలిపారు. డిసెంబరు 31, 2025లోపు స్థానిక సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని, సరైన ఆధారాలు చూపినవారికి రెగ్యులరైజేషన్ చేయబడుతుందని ఆమె తెలిపారు.

బంగారు, నగదు చోరీ

వల్లూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తోళ్లగంగనపల్లె క్రాస్ వద్ద కడప-తాడిపత్రి ప్రధాన రహదారిలో ఉన్న మామిళ్ల గురివిరెడ్డి ఇంటిలో బుధవారం రాత్రి బంగారు, నగదు చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మామిళ్ల గురివిరెడ్డి తన ఇంటిలోని డబుల్ కాట్‌కు ఉన్న లాకర్‌లో బంగారు, నగదు ఉంచి శివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి అల్లాడుపల్లె దేవాలయంలో జాగరణ చేయడం కోసం ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. గమనించిన దుండగులు ఇంటి ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బెడ్‌రూంలోకి వెళ్లి డబుల్ కాట్ లాకర్‌లో ఉన్న 80 గ్రాముల బంగారు, 40వేల నగదును చోరీ చేశారు. గురువారం ఉదయం ఇంటికి చేరుకున్న గురివిరెడ్డి చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కమలాపురం సీఐ ఎస్కే రోషన్ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

45 మద్యం ప్యాకెట్లు స్వాధీనం

● వ్యక్తి అరెస్టు

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి 45 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి తెలిపారు. పెద్దరంగాపురం క్రాస్ వద్ద కర్ణాటక మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేశామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ, పోలీసులు పాల్గొన్నారు.

ప్రహరీ గోడ కూలి విరిగిన విద్యుత్ స్తంభం

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రహరీ గోడ కూలి విద్యుత్ స్తంభం విరిగిపోయింది. గురువారం పట్టణ పరిధిలోని సదాశివారెడ్డి హాస్పిటల్ పక్కన ఉన్న మున్సిపాలిటీ మస్టర్ సెంటరు ప్రహరీగోడ కూలడంతో పక్కన ఉన్న కరెంటు స్తంభం విరిగిపడింది. ఆ సమయంలో జనాలు లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. ఒక అడ్వకేట్‌కు చెందిన కారు మీద గోడ పడడంతో కారు ధ్వంసమైంది. విద్యుత్‌స్తంభం పడిపోవడం వల్ల ఈ ఏరియాలోని టీవీలు, ఫ్రిజ్‌లు కూడా కాలిపోయాయని చుట్టుపక్కల ప్రజలు అంటున్నారు.

జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డిని సస్పెండ్ చేసినట్లు కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. సర్వీస్ మేటర్స్‌లో నగదు డిమాండ్ చేయడంపై ప్రాథమిక విచారణలో నిజమని తేలిందని వివరించారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఎవరైన అవినీతికి పాల్పడితే తమ దృష్టికి తేవాలని సూచించారు.

నీలాపురం కాజ్‌వే నిర్మాణమెప్పుడో..?

●రూ.40 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసిన పంచాయతీరాజ్ అధికారులు ● మంజూరైతే ప్రజలకు ఎంతో ప్రయోజనకరం

దువ్వూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలం నీలాపురం సుగాలితాండ మార్గ మధ్యంలో కాజ్‌వే (చిన్నపాటి బ్రిడ్జీ) నిర్మాణం ఎప్పుడు చేపడతారంటూ ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఇక్కడ కాజ్‌వే మంజూరైతే ప్రజలకు ఈ మార్గం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. కాగా ఇప్పటికే ఈ కాజ్‌వే నిర్మాణ పనుల కోసం రూ.40 లక్షలతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. ఇక్కడ తెలుగుగంగ నీరు ఉప కాలువ గుండా ప్రతియేటా ప్రవహిస్తుంది. నీరు ప్రవహించేటప్పుడు నడుములోతు నీరు నిత్యం అందులో ఉంటుంది. ఆ సమయంలో ప్రజలు, రైతుల రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతవాసులు ఈ సమస్యను ఎదుర్కోబట్టి 20 ఏళ్లకుపైగా అవుతోంది. ఈ కాలువ ప్రవహించే పై భాగంలో రైతుల పొలాలు ఉన్నాయి. ఆ పొలాల వద్దకు వెళ్లి వ్యవసాయ పనులు చేసుకోవాలంటే వంకలో దిగేందుకు అవస్థలు పడుతున్నారు. సుగాలితాండా నుంచి ఇటు పక్కకు రావాలన్నా జనాలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో కాజ్‌వే నిర్మాణం జరిగితే కొన్నేళ్లుగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించినట్లు అవుతుందనేది ఈ ప్రాంత వాసుల వాదన. ఎన్నో ఏళ్ల ప్రజల ఇబ్బందులను అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని మండలవాసులు కోరుతున్నారు.


నీలాపురం-సుగాలితాండ మార్గంలో కాజ్‌వే నిర్మించాల్సిన ప్రాంతం


తెలుగుగంగ నీరు ప్రవహించే ఉప కాలువ

గ్రామ సభలో వచ్చిన అర్జీలకు పరిష్కారం

బి.కోడూరు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల రెవెన్యూ గ్రామ సభలలో వచ్చిన అర్జీలను పరిశీలించి తహసీల్దారు దస్తగిరయ్య పరిష్కరించారు. అంకనగొడుగునూరు గ్రామంలో గురువారం స్థానిక వీఆర్వో, సర్వేయర్లను తీసుకుని తహసీల్దారు వెళ్లి గ్రామ సభలో సమస్యపై ఫిర్యాదు చేసిన అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తమ పొలాల వద్దకు వెళ్లి పరిశీలించి పరిష్కరించారు. గ్రామ సభలో వచ్చిన ప్రతి ఫిర్యాదు పరిష్కరిస్తామని ఆయన అన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మసీదును ప్రారంభించిన భూపేశ్‌రెడ్డి


దేవగుడిలో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డిని సత్కరిస్తున్న ముస్లిం మత పెద్దలు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దేవగుడిలో గురువారం టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి మసీద్ ఎ సిరాజ్ (జామియా మసీదు)ను ప్రారంభించారు. ముందుగా గ్రామంలోని ముస్లిం మత పెద్దలు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికి ఆయనను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మసీదును ప్రారంభించి ముస్లిం మతపెద్దలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చదిపిరాళ్ల రామాంజనేయరెడ్డి, గోపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, స్థానిక ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్తు అంతరాయం లేకుండా చూడాలి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో విద్యుత్తు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ నాయకులు గురువారం ట్రాన్స్‌కో ఈఈ రమణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఉదయం, సాయంత్రం మసీదులలో ప్రార్థనలు నిర్వహిస్తారని నెలరోజులపాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్లాట్లు ఆక్రమించి భయపెడుతున్నారు

●న్యాయం చేసి ఆదుకోవాలంటున్న బాధితులు


బాధితులతో కలిసి మాట్లాడుతున్న సర్పంచ్ శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): సుమారు పాతికేళ్ల కిందట భద్రంగా దాచుకున్న తమ ప్లాట్లను ఇప్పుడు కొందరు రాజకీయ నాయకులు ఆక్రమించి తమకు హక్కు లేదని భయపెడుతున్నారని బాదితులు వాపోతున్నారు. తమ వెంచర్‌లను అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు. ఆమేరకు గురువారం కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని మదూరు రోడ్డులో ఉన్న కాశినాయన సత్రం సమీపంలోని వెంచర్ వద్ద బాదితులు గ్రామ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డితో కలిసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా బాధితులు ఎస్ఎస్ మోహిద్దీన్, జయరామిరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు మాట్లాడుతూ.. 1996లో డాక్టరు ప్రమీలా రంగారెడ్డి ఈ ప్రాంతంలో సుమారు 1300 ప్లాట్లతో వెంచర్లను వేశారని అప్పట్లో కొంత మంది నేరుగా మరికొందరు కంతుల రూపంలో డబ్బులను చెల్లించి కొనుగోలు చేశామన్నారు. అయితే కొత్తపల్లికి చెందిన ఇద్దరు రాజకీయ నాయకులు ఈ ప్లాట్లను ఆక్రమించి సబ్‌డివిజన్ చేసుకుని అక్రమాలకు యత్నిస్తున్నారన్నారు. ఈ విషయంపై అధికారులు, స్థానిక ఎమ్మెల్యే సర్పంచ్ చొరవ చూపి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. సర్పంచ్ శివచంద్రారెడ్డి మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజలకు జరుగుతున్న అన్యాయానికి తాను అండగా నిలిచి వారికి న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

ఖాజీపేట, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): శివరాత్రిని పురష్కరించుకుని నాగేశ్వరుని కోనలో, తీర్థాల్లో శివపార్వతులకు కల్యాణం వైభవంగా నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి లింగోద్భవ పుణ్యకాలం అనంతరం రుద్రాభిషేం నిర్వహించారు. అనంతరం నేలమాల దగ్గర అఖండ జ్యోతి వెలిగించి శివపార్వతులకు కల్యాణం ఘనంగా నిర్వహించారు. నాగనాదేశ్వరుని కోన నుంచి శివపార్వతుల విగ్రహాలను ఖాజీపేట అగ్రహారం శివాలయం వద్దకు ఊరేగింపు నిర్వహించారు. తీర్థాల్లో విద్యుత్తు సౌకర్యం లేకపోయినా రెండు రోజులపాటు జనరేటర్లను ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

వరి, రాగి పంటల పరిశీలన

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సోమిరెడ్డిపల్లె పంచాయతీలో రైతు విజయభాస్కర్ పొలాన్ని ఊటుకూరు పరిశోధన స్థానం నుంచి రాగులు, వరి పంటలను వ్యవసాయశాస్త్రవేత్త అంకయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రమ్ సీడరు సహాయంతో విత్తన వరి పంటను పరిశీలించి రైతులకు పొటాష్, జింక్ ఎరువుల వాడకం గురించి తెలిపారు. వ్యవసాయ సహాయకుడు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.40వేలు విరాళం

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని యాదవ సమాజ అన్నదాన సత్రంలో పేదలకు అన్నదానం నిర్వహించేందుకు చెన్నై వాస్తవ్యులు సూర్యకుమారి కాత్యాయని వారి బృందం సభ్యులు రూ.40వేలు అందజేశారు. ఇందులో కమిటీ అధ్యక్షుడు పెరుగు క్రిష్ణ య్యయాదవ్ ప్రధాన కార్యదర్శి లక్కినేని బాలరాజుయాదవ్, కోశాధికారి మేకల పెద్దన్న యాదవ్‌కు అందజేశారు. కమిటి సభ్యులు పాల్గొన్నారు.

దేశభక్తుడు చంద్రశేఖర్ ఆజాద్

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన గొప్ప దేశభక్తుడు చంద్రశేఖర్ ఆజాద్ అని డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ పేర్కొన్నారు. గురువారం చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతిని పురష్కరించుకుని డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం చిన్నవయస్సులోనే ప్రాణాలు అర్పించిన గొప్ప నాయకుడు ఆజాద్ అని పేర్కొన్నారు. యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, డీవైఎఫ్ఐ నాయకులు శ్రీను, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

గండికోట ముంపు సమస్యలపై నేడు చలో కలెక్టరేట్

కొండాపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : గండికోట ప్రాజెక్టు ముంపువాసుల సమస్యలపై శుక్రవారం చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు మండల సీపీఐ కార్యదర్శి మనోహర్‌బాబు తెలిపారు. ఈ నెల 24న ఓబన్నపేటలో నిర్వహించిన ముంపువాసుల సదస్సులో తీర్మానం మేరకు ఈ కార్యక్రమం చేపట్టనున్నామన్నారు.శుక్రవారం జరిగే బడ్జెట్‌లో ముంపు పరిహారానికి నిధులు కేటాయించాలని కలెక్టర్‌ను కోరనున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి 22 గ్రామాల ముంపువాసులు హాజరుకావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా స్థానిక మెయిన్‌రోడ్డుపై సీపీఐ నాయకులు నినాదాలు చేశారు. ఏఐటీయూసీ నాయకులు వెంకటరమణ, సుబ్బారావు, ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌లు సత్వరం పరిష్కరించాలి

రెవెన్యూ అధికారుల సమీక్షలో ఆర్డీవో సాయి శ్రీ


రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీవో సాయిశ్రీ

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులు (పీజీఆర్ఎస్) పెండింగ్ లేకుండా ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ రెవెన్యూఅధికారులను హెచ్చరించారు. గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ అధికారులు సిబ్బందితో ఆర్డీవో సాయిశ్రీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రొద్దుటూరులో 207 పీజీఆర్ఎస్‌లకు ఇంకా 101 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని ఎందుకుక్లియర్‌చేయలేకపోయారో వీఆర్వోలను విచారించారు. గ్రామాల్లోకి వెళ్ళినప్పుడు గానీ కార్యాలయంలో ఉన్నప్పుడు గానీ ప్రజలతో అధికారులు మార్యదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. సమీక్షలో తహసీ ల్దారు గంగయ్య, డీటీలు సాయినాథ్‌రెడ్డి, సుదర్శన్ ,అజయ్‌బాబు, ఆర్ఐ నాగమోహన్ రెడ్డిలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలు జరిపితే చర్యలు తప్పవు


దుకాణాల పై దాడులు చేసి స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ వస్తువులు

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో ప్లాస్టిక్ విక్రయాలు జరిపితే దాడులు చేసి స్వాధీనం చేసుకోని కేసులు నమోదు చేస్తామని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున హెచ్చరించారు. గురువారం స్థానిక కోనేటి కాల్వ వీధిలోని ప్లాస్టిక్ విక్రయించే దుకాణాలపై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ దాడులలో మేడా శ్రీహరి దుకాణంలో నిర్వహించిన తనిఖీల్లో దాదాపు 30 వేల విలువ చేసే ప్లాస్టిక్ గ్లాసులు కవర్లు ఇతర వస్తువులు పట్టుబడ్డాయి. వాటిని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సుబ్బరాయుడు నూర్‌బాషాలు స్వాధీనం చేసుకొని మున్సిపల్ వాహనంలో కార్యాలయంకు తరలించారు. మొదటగా హోల్‌సేల్ దుకాణాలు ఆ తరువాత ప్రతి దుకాణాలు హోటళ్ళు చికెన్ సెంటర్లు టిఫిన్ సెంటర్లు పూల పండ్ల వ్యాపారుల వద్ద ప్లాస్టిక్ రైడింగ్స్ చేస్తామన్నారు. ఎవ్వరి దగ్గర దొరికినా జరిమానా విధిస్తామన్నారు.

కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీలో 22 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లుకు వెంటనే బిల్లులు చెల్లించాలని మున్సిపల్ కాంట్రాక్టర్లు కమిషనర్ మల్లికార్జునను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎఫ్ఎంఎస్‌లో బిల్లులు ఎక్కినప్పటికి నెలలు గడుస్తున్నా ఎప్పుడు డబ్బులు పడతాయో తెలియడం లేదన్నారు. ఆఖరికి ఈఎంఐలు కూడా చెల్లించలేదన్నారు. ఇందుకు కమిషనర్ స్పందిస్తూ గత ఐదేళ్ళకాలంలో బడ్జెట్‌లేకుండానే పనులు చేపట్టడం వలన ఈ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఏప్రిల్ మొదటి వారంలో పన్నుల రాబడి ఆదారంగా బిల్లులు చెల్లింపు జరుగుతుందన్నారు. ఈఎండీలు సైతం త్వరిగతిన చెల్లిస్తామన్నారు. కాంట్రాక్టర్లు కృష్ణార్జున రెడ్డి బద్వేలు ప్రభాకర్‌రెడ్డి ,సందీప్‌రెడ్డి, పల్లేటి సుబ్బారెడ్డి ,ధనిరెడ్డి శ్రీధర్‌రెడ్డి బంగారుబాబురెడ్డి, నిజాం ఉన్నారు.

జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారికి పూజలు


పార్వతీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేస్తున్న మఠాధిపతి, దాతలు

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : జగన్మాత ఈశ్వరీదేవి అమ్మవారి మఠంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దాతలు సుంకు సురేశ్‌బాబు, వరలక్ష్మి, నాగజశ్వంత్, శశాంక్, శంకరమ్మ, వెంకటసుధా సప్లయర్స్ అధినేత ఎం.భాస్కర్‌రెడ్డి, పద్మావతి, ముని రేవంత్‌కుమార్‌రెడ్డి, శశాంత్‌కుమారరెడ్డి, వీరపు ఉమాపతి, ఉమా గాయత్రి, కుమారులు గంగా దివ్యతేజ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలన్నీ మఠాధిపతులు శ్రీ వీర శివకుమారస్వామి దాతల ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. అనంతరం రాత్రికి ఘనంగా గ్రామ పురవీధుల గుండా పార్వతీ పరమేశ్వరులను గ్రామోత్సవాన్ని చేపట్టారు.

వైభవంగా గంగమ్మ,పాలేటమ్మ తిరునాళ్లు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ, పాలేటమ్మ

ముద్దనూరు ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి) :మండల పరిధి బొందల కుంట గ్రామంలో వెలసిన గంగమ్మ,పాలేటమ్మ తిరుణాల వైభవంగా నిర్వహించారు. ధర్మకర్త సుబ్బరాయుడు ఆధ్వర్యంలో గుడిలో కొలువై ఉన్న గంగమ్మ, పాలేటమ్మలకు ప్రత్యేక అలంకరణ చేశారు. మండలం నుంచే కాకుండా పక్క మండలాల నుంచి భారీ సంఖ్యలో జనం తిరుణాలకు తరలివచ్చారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు ప్రత్యేక క్యూ ఏర్పాటు చేశారు. భక్తులకు ధర్మకర్తలు తీర్థ, ప్రసాదాలు పంపిణీ చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎగువ నేలటూరు గ్రామానికి చెందిన కె.రామలక్షుమ్మ, భర్త సుబ్బయ్యల కుమారుడు కె.సునీల్ (20) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. జనవరి 27వతేదీన ఇంట్లో గ్యాస్ లీక్ అయి మంటలు చెలరేగడంతో భార్య రామలక్షుమ్మ, కుమారుడు సునీల్ ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారని సుబ్బయ్య తెలిపారు. కాగా కడపలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 14న భార్య రామలక్షుమ్మ మృతి చెందిందని కుమారుడు తిరుపతిలో వైద్య చికిత్సలు తీసుకుంటూ గురువారం మృతి చెందాడని తెలిపారు. ఒకే కుటుంబంలో ప్రమాద ఘటనలో ఇద్దరు మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.ప్రభుత్వం కుటుంబానికి ఆర్థికసాయం చేయాలని గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

పీహెచ్‌సీలలో కాన్పుల సంఖ్య పెరగాలి


ఆసుపత్రి పరిసరాలను పరిశీలిస్తున్న రీజనల్ డైరెక్టర్

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలల్లోని పీహెచ్‌సీలలో కాన్పుల సంఖ్య పెరిగేందుకు గర్భిణిలకు ఆసుపత్రి సౌకర్యాలపై అవగాహనతో పాటు వారిని చైతన్యపరచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య పేర్కొన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న వైద్యాధికారి శ్రీనివాస్‌తో మాట్లాడి ఈహెచ్‌ఆర్ నమోదు గురించి మందుల సరఫరా గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల గర్భిణులకు పీహెచ్‌సీలల్లోనే కాన్పులు జరిగేలా చూడాలని కనీసం నెలకు ఐదు కాన్పులు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి సిబ్బందితో కలిసి గదులను పరిసరాలను సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఫార్మసీ అధికారి శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ మధు, ఇన్‌చార్జీ స్టాఫ్‌నర్సు రాధ, ల్యాబ్ టెక్నీషయన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

జమ్మలమడుడు, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో మార్చి 1వ తేదీ నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు.ఇంటర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ప్రతిరోజు ఉదయం 8.45 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. 9 గంటలు దాటితే పరీక్షలకు అనుమతించరన్నారు జమ్మలమడుగు పట్టణంలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జయసు బ్బారెడ్డి మాట్లాడుతూ మార్చి 1వ తేదీ ఉదయం తెలుగు పరీక్షకు 299 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతారన్నారు, బాలికల జూనియర్ కళాశాలలో 297 మంది, వివేకానంద జూనియర్ కళాశాలలో 334 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉంది.

కొండాపురంలో:స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో శనివారం నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడి యట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయినట్లు చీఫ్ సూపరెండెంట్ క్రిష్ణవేణి తెలిపారు. ఈ పరీక్షాకేంద్రంలో కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు, గురుకుల పాఠశాల, ముద్దనూరు కళాశాలలకు సంబంధించి 124 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఆమె తెలిపారు. పరీక్షాకేంద్రంలో విద్యార్థులకు టేబుళ్ళ, ఫ్యాన్లు నీటివసతి కొరత లేకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మార్చి 1 నుంచి 15 వతేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీ క్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. పదినిమిషాలు ఆలస్యమైనా పరీక్షకు అనుమతించబో మని చీఫ్ సూపరెండెంట్ తెలిపారు. కాగా ఈ ఏడాది మొదటిసారిగా కొండాపురం బాలికల గురుకుల పాఠశాలలో పరీక్షాకేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

మోటార్ల కేబుల్ వైర్ల చోరీలు.. ఆందోళనలో రైతన్నలు

కాశినాయన ఫిబ్రవరి27(ఆంధ్రజ్యోతి):కాశినాయన కలసపాడు మండలాలల్లో మోటార్ల కేబుల్ వైర్ల చోరీలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. పిట్టిగుంట, చెన్నారెడ్డిపల్లె, మామిళ్ల పల్లె పెండ్లిమర్రి తదితర గ్రామాల పరిధిలో రైతుల వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లు చోరీలకు గురవుతుండడంతో చేతికి వచ్చే పంటలను రక్షించుకోలేకపోతున్నామని వాపోతున్నారు. వారం రోజుల క్రితం మామిళ్లపల్లె తెలుగంగ కాలువ వెంట ఉంటే వెంకట సుబ్బారెడ్డి,సుధాకర్ పెండ్లిమర్రి సమీపంలోని రమణ, గురయ్య తదితర 10 మంది రైతులకు చెందిన మోటారు వైర్లు చోరీకి గురయ్యాయి. అలాగే పిట్టిగుంట, చెన్నారెడ్డిపల్లె గ్రామాలకు చెందిన రాజశేఖర్‌రెడ్డి, ఉస్సేనయ్య, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు తదితర రైతుల మోటార్ల వైర్లు చోరీ జరగడంతో ఆందోళన చెందుతున్నారు. గతంలో దొంగలు మోటారు నుంచి స్టాటర్‌వరకు ఉన్న వైరు కత్తెరించేవారని ప్రస్తుతం మోటారు లోపలి జాయింట్ వరకు వైర్లు కత్తిరించి చోరీకి పాల్పడుతుండడంతో భారీగా నష్టం వస్తోందంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని మోటారు కేబుల్ వైర్ల చోరీలకు అడ్డుకట్టవేయాలని రైతులు కోరుతున్నారు.

భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు లక్ష్మినారాయణ

మైలవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రైతులకు భూ సమస్యలు లేకుండా పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని తహసీల్దారు లక్ష్మినారాయణ అన్నారు. గురువారం మండల పరిధిలోని బెస్తవేముల సచివాలయంలో రైతు సదస్సు సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ భూ సమస్యలుంటే వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వం ఆయా సచివాలయాల్లో రైతు సదస్సు నిర్వహిస్తోందన్నారు. ఏవైనా భూ సమస్యలుంటే దరఖాస్తు చేసుకోవాలని వాటితోపాటు గ్రామాల్లో ఏవైనా సమస్యలున్నా తమ దృష్టికి తేవాలని ఆయన తెలిపారు. గ్రామాల్లో నిర్వహించే సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లపట్టాల మంజూరులో జాప్యమెందుకు..?


దీక్షలకు మద్దతు తెలిపిన సీపీఐ జిల్లాకార్యవర్గ సభ్యుడు సుబ్బారెడ్డి

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి) : పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే వారికి ఇంటిపట్టాలు మంజూరు చేయడంలో జాప్యమేమిటని సీపీఐ జిల్లకార్యవర్గ సభ్యుడు సుబ్బారెడ్డి ప్రశ్నించారు. భాకరాపేట సమీపంలో సీపీఐ కాలనీవాసులు తమకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం ఏడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ శ్మశానానికి కాలనీకి సంబంధంలేకున్నా పేదలు ఇక్కడ నివాసం ఉండకూడదని కొందరు గొడవలు సృష్టించారన్నారు. కార్యక్రమంలో దళిత వేదిక జాతీయ నేత రెడ్డన్న, సీపీఐ జిల్లా సమితి సభ్యులు పడిగె వెంకటరమణ, ఓబయ్య, యోహాను దీక్షల్లో సీపీఐ రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానుయేల్, సుబ్బారెడ్డి, ప్రసాద్, రామక్క, అంజనమ్మ పాల్గొన్నారు.

ఇంటిపట్టాలు ఇవ్వకుంటే ఉద్యమాలు ఉధృతం

గోపవరం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): పేదలకు పట్టాలు ఇవ్వకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామని జిల్లా సీపీఐ కార్యవర్గ సభ్యుడు రామయ్య అన్నారు. పీపీకుంట వద్ద ఇంటిపట్టాల కోసం నిరాహారదీక్ష శిబిరం వద్ద బాధితులను గురువారం కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల జోలికి వస్తే ఎన్ని అక్రమ కేసులు పెట్టినా జైలుకు పంపించినా ఎన్ని నిర్బంధాలు పెట్టినప్పటికీ ఇంటిపట్టాలు, మౌలిక సదుపాయాలు దక్కేంత వరకు అవిశ్రాంత పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు వీరశేఖర్, భూపోరాట కమిటి కన్వీనరు పీవీ రమణ, కార్యదర్శి వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఓబులేసు, సభ్యుడు ఓబులమ్మ పాల్గొన్నారు.

భిక్షాటన చేయడం నిషేధం


అవగాహన కల్పిస్తున్న కృష్ణ ప్రతిరూప్

బద్వేలు, ఫిబ్రవరి 27(ఆంధ్రజ్యోతి): పిల్లల చేత భిక్షాటన చేయించడం నిషేధమని బాలల పరిరక్షణ అధికారి వీరబల్లి కృష్ణ ప్రతిరూప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి ఆదేశాల మేరకు గత మూడు రోజులుగా బద్వేలు లంకమల అభయారణ్యంలోని మల్లెం కొండేశ్వర స్వామి ఆలయం వద్ద అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ క్రమంలోనే మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా ఐసీడీఎస్, ఎండోమెంటు, రెవెన్యూ, పోలీసు, కార్మిక శాఖలసహకా రంతో పలువురికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఎక్కడైనా బాల కార్మికులుగాని, చిన్న పిల్లలు గాని పనిచేస్తే వెంటనే 1098 నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ క్రమంలో ఆలయ పరిసరాలలో భిక్షాటన నిషేధం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, సూపర్‌వైజర్ సువర్ణ, ఐసీడీఎస్ అవుట్ రీచ్ వర్కర్ యూనస్‌బాష, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

పశువైద్య విద్యార్థుల నిరసన

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పశువైద్య కళాశాలలో విద్యార్థులు తరగతులను బహిష్కరించి కళాశాల ప్రధాన ద్వారం ఎదుట నిరసన తెలిపారు. గురువారం 25వ రోజు నిరవదిక సమ్మెలో భాగంగా ఉదయం నుంచి సాయంత్రం నాలుగు వరకు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య రంగ విద్యార్థులతో సమానంగా తమకు కూడా ఉపకారవేతనాన్ని పెంచుతూ ప్రభుత్వం వెంటనే జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ న్యాయపరమైన డిమాండ్ నెరవేరే వరకూ పోరాటం కొనసాగిస్తామని వివరించారు.